# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు బెంగళూరులో నిర్వహించే ‘ది ఎర్త్ సెంటర్, విస్టా స్పేసెస్’ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.**

**2. విద్యార్థులకు అందించే యూనిఫాంలను మరింత ఆకర్షణీయమైన రంగుల్లో, విభిన్న నమూనాలతో రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**3. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ రేపటి నుంచి రెండు రోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.**

**4. రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు బెంగళూరులో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి ఈ సాయంత్రం బెంగళూరుకు బయలుదేరి వెళ్లనున్నారు. బెంగళూరులోని ‘ది ఎర్త్ సెంటర్, విస్టా స్పేసెస్’ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. కార్యక్రమం ముగించుకుని రాత్రికి బెంగళూరులోనే బస చేస్తారు. రేపు ఉదయం బెంగళూరు నుంచి ముఖ్యమంత్రి నేరుగా చిత్తూరు జిల్లా పర్యటనకు వెళతారు.

-------------------------

విద్యార్థులకు అందించే యూనిఫాంలను మరింత ఆకర్షణీయమైన రంగుల్లో, విభిన్న నమూనాలతో రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాదులో విద్యార్థుల యూనిఫాంలు, ఇతర సామగ్రి పంపిణీపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు తెరిచే రోజే యూనిఫాం, ఇతర సామగ్రి అందేలా ముందుగానే ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది అదనంగా 10 శాతం మంది విద్యార్థులు చేరే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ రేపటి నుంచి రెండు రోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా దాదాపు ఒక వెయ్యి 500 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, తాగునీటి సదుపాయాలు కల్పించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ, మత్స్యకారుల సంక్షేమం, మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ పలు కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో తాగునీటిని సరఫరా చేసేందుకు పునరుద్ధరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

'విజన్-2047'లో భాగంగా రాష్ట్రాలు తమ అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రులు, నిపుణులతో నిన్న నిర్వహించిన అత్యున్నత స్థాయి మేధోమథన సమావేశంలో చర్చించినట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. కేంద్రం నుంచి వచ్చే సాధారణ నిధులకు భిన్నంగా భవిష్యత్ అవసరాలకు అదనపు వనరులను ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై ఈ సదస్సు ఉపయుక్తంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో సవాళ్లు, వాటికి కావాల్సిన ఆర్థిక వనరుల సమీకరణపై నిపుణులు సలహాలు ఇచ్చారని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

-------------------------

రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు, ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించేందుకు ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న రైతు బజార్‌కు మంత్రి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి నిన్న భూమిపూజ చేశారు. తొలి దశలో 48 దుకాణాలు, రెండో దశలో మరో 200 దుకాణాల ఏర్పాటును చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

-------------------------

విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్‌లో నిన్న నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని సాగర స్వచ్ఛత కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెదజాలరిపేటలో ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. సముద్ర వ్యర్థాల సేకరణలో పాల్గొంటున్న పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులు, స్కూబా డైవర్లతో మాట్లాడారు. మురుగు కాల్వల శుభ్రతకు మహా విశాఖ నగర పాలక సంస్థ వినియోగిస్తున్న ఆధునిక రోబో పనితీరును పరిశీలించారు. సాగర స్వచ్ఛతలో భాగంగా 12 వందల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడమే లక్ష్యమని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

-------------------------

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం నగరంలోని మహిళా కళాశాలలో నిన్న నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత విద్యార్థులతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో పరిశు

భ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్వయంగా వ్యర్థాలను తొలగించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన నిన్న రాత్రి అత్యంత వైభవంగా గరుడసేవను నిర్వహించారు. విశేషంగా అలంకరించిన గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలపై ఆకాశవాణి తిరుపతి జిల్లా ప్రతినిధి మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్..27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్‌లోని 395 గ్రామాల్లో నిన్నటి నుంచి ప్రారంభించిన సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని వచ్చే నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఆదికర్మయోగి వాలంటీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది, స్థానిక సంస్థలు, గ్రామ ప్రజల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

---------------------------

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సూక్ష్మ పోషకాలు, జీవ ఎరువులు, పచ్చిరొట్ట వినియోగాన్ని పెంచాలని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాదులోని సచివాలయంలో వ్యవసాయ శాఖపై సమీక్షా సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహజ సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. నకిలీ, నాసిరకం ఎరువులు, పురుగుమందుల ఉత్పత్తిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రబీ సాగుకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు.

---------------------------

ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అదే ప్రాంతంలో కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో అల్పపీడనం ఏర్పడిందని, ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ, క్రమంగా బలపడి రేపు తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగాను, ఎల్లుండి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగాను మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొంటూ..

వాయిస్...25 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================